AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
13-12-2025 (Saturday) MAIN EDITION

## శ్రీవారిని దర్శించుకున్న రజనీకాంత్



**అక్షరటుడే, తిరుమల:** తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ శనివారం తెల్లవారుజామున తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం వీఐపీ విరామ సమయంలో ఆలయానికి చేరుకున్న ఆయనకు టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకొని వచ్చిన రజనీకాంత్‌ను చూసిన అభిమానులు ఆయనతో ఫొటోల కోసం ఎగబడ్డారు.

## మోటోరోలా నుంచి మిడ్‌రేంజ్ ఫోన్



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** చైనాకు చెందిన లెనోవా యాజమాన్యంలో నడుస్తున్న ప్రముఖ స్మార్ట్ ఫోన్ తయారీ కంపెనీ అయిన మోటోరోలా నుంచి మిడ్ రేంజ్‌లో మరొక స్మార్ట్ ఫోన్ వస్తోంది. స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్, 50 ఎంపీ ట్రిపుల్ కెమెరా సెటప్‌తో వస్తున్న మోటోరోలా ఎడ్జ్ 70 5జీ స్మార్ట్ ఫోన్ డిసెంబర్ 15న మధ్యాహ్నం 12 గంటలకు రిలీజ్ కానుంది. ఫ్లిప్‌కార్ట్‌తోపాటు మోటోరోలా వెబ్‌సైట్లలో అందుబాటులో ఉండనుంది.

## చమురు ట్యాంకర్ సీజ్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** చమురు నౌకను ఇరాన్ సీజ్ చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన చోటుచేసుకొంది. అందులోని సిబ్బందిలో భారతీయులు కూడా ఉన్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నౌకలో మొత్తం 18 మంది సిబ్బంది ఉండగా.. వారిలో బంగ్లాదేశ్, శ్రీలంక వాసులు కూడా ఉన్నారని పేర్కొన్నాయి.

## మెస్సీ ఈవెంట్ ఆర్గనైజర్ అరెస్టు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి కోల్‌కతా టూర్‌లో గందరగోళం నెలకొంది. మెస్సీని చూడలేకపోయామని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాల్ట్‌లేక్ స్టేడియంలోకి కుర్చీలు విసిరేసి ఆందోళన చేపట్టారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఈవెంట్ ఆర్గనైజర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

## కేరళ స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. 1,199 స్థానిక సంస్థలకు పోలింగ్ జరగ్గా.. శనివారం కౌంటింగ్ చేపట్టారు. అధికార ఎల్డీఎఫ్ పంచాయతీల్లో ముం దుండగా.. ప్రతిపక్ష యూడీఎఫ్ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆధిక్యం చూపుతోంది. తిరువనంతపురం కార్పొరేషన్‌లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది.

## డబ్బులు తిరిగి తీసుకుంటున్న ఓడిన అభ్యర్థులు

**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో తొలిదశ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. అయితే పలు గ్రామాల్లో హోరాహోరీగా పోరు జరగడంతో సర్పంచ్ అభ్యర్థులు భారీగా ఖర్చు చేశారు. తీరా ఓడిపోవడంతో వారు మనోవేదనకు గురవుతున్నారు. ఈ క్రమంలో పలువురు అభ్యర్థులు ప్రజలకు ఇచ్చిన డబ్బులు తిరిగి తీసుకుంటున్నారు. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఔరావాణిలో అభ్యర్థి కల్లూరి బాలరాజు ఓడిపోయారు. దీంతో ఆయన దేవుని ఫొటో, పురుగుల మందు డబ్బా పట్టుకొని తన భార్యతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగారు. ఓటుకు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరారు. దీంతో ఈ విషయం తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ ఎన్నికల్లో బాలరాజుపై జక్కలి పరమేశ్ 448 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు.

## మాటలతో యుద్ధాలు గెలవలేం : సీడీఎస్

**అక్షరటుడే, హైదరాబాద్ :** మాటలతో యుద్ధాలు గెలవలేమని పాకిస్థాన్‌కు భారత చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ చురకలు అంటించారు. హైదరాబాద్ నగరంలోని దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన 'కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్'లో శనివారం ఆయన పాల్గొన్నారు. యుద్ధాలను వాక్చాతుర్యంతో మాత్రమే గెలవలేమని సీడీఎస్ అన్నారు. నిజమైన బలం క్రమశిక్షణ, ప్రణాళిక, నిర్ణయాత్మక అమలు నుంచి వస్తుందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ భారీ నష్టాన్ని చవిచూసినప్పటికీ ఆ దేశ నాయకులు తామే గెలిచనట్లు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో సీడీఎస్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# మెస్సీ Vs రేవంత్‌రెడ్డి



“ ఫుట్‌బాల్ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీ మరికొద్ది సేపట్లో హైదరాబాద్ నగరంలో మ్యాచ్ ఆడనున్నాడు. దీనికోసం అభిమానులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మెస్సీని చూసేందుకు తహతహలాడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మెస్సీతో తలపడనున్న నేపథ్యంలో భారీ ఎత్తున అభిమానులు తరలి రానున్నారు. ఈ వేడుక కోసం ఉప్పల్ స్టేడియం సిద్ధమైంది. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ మెస్సీ గోట్ టూర్‌లో భాగంగా భారత్‌లో పర్యటిస్తున్నారు. శనివారం ఉదయం కోల్‌కతాలో మ్యాచ్ ఆడిన ఆయన సాయంత్రం హైదరాబాద్ రానున్నారు. ఈ మ్యాచ్‌లో మెస్సీతో పాటు లూయిస్ సూయారేజ్, రోడ్రిగో డి పాల్ వంటి అంతర్జాతీయ స్టార్లు పాల్గొంటారు. సంగీత విభావరితో మెస్సీ టూర్ ప్రారంభం కానుంది. అనంతరం ఫ్రెండ్లీ మ్యాచ్ మొదలవుతుంది. ఈ మ్యాచ్‌లో ఆర్ఆర్ 9 వర్సెస్ మెస్సి ఆల్ స్టార్స్ జట్లు తలబడనున్నాయి. 20 నిమిషాల పాటు సాగే ఈ మ్యాచ్‌లో ఆఖరి ఐదు నిమిషాల్లో మెస్సి, రేవంత్ రెడ్డి మైదానంలో బరిలోకి దిగుతారు. నిర్ణీత సమయం ముగిశాక రేవంత్, మెస్సి పెనాల్టీ షూటౌట్ ఆడతారు.


■ రాత్రి 8 గంటలకు మ్యాచ్ ప్రారంభం ■ మెస్సీని చూసేందుకు ఫ్యాన్స్ ఉత్సాహం ■ భారీ భద్రత ఏర్పాటు చేసిన పోలీసులు ■ కోల్‌కతాలో గందరగోళంతో అప్రమత్తం

### రేవంత్ ప్రాక్టీస్

మెస్సీ టూర్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ మ్యాచ్ కోసం తీవ్రంగా శ్రమించారు. రోజంతా పలు పనుల్లో బిజీగా ఉన్నా.. రాత్రి పూట ప్రాక్టీస్ చేశారు. విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ క్రమంలో మ్యాచ్‌కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. దేశవిదేశాల నుంచి అతిథులు రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు. టికెట్లు ఉన్నవాళ్లే స్టేడియం దగ్గరకు రావాలని సూచించారు. ఈ మ్యాచ్ చూడటానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరు కానున్నారు.

### ఫొటోకు రూ.10 లక్షలు

లియోనెల్ మెస్సీ హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఫొటో సెషన్ ఏర్పాటు చేశారు. 'మెస్సీతో మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో ఆయనతో ఫొటోలు దిగడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆయనతో ఒక్క ఫొటోకు రూ.10 లక్షలు వసూలు చేస్తున్నారు. అది కూడా వంద మందికి మాత్రమే అవకాశం ఉంది. ఫొటో దిగాలనుకునే వారు డిస్ట్రిక్ట్ యాప్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే 60 మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.



### కోల్‌కతాలో ఫ్యాన్స్ ఆగ్రహం

మెస్సీ ఉదయం కోల్‌కతా పర్యటించారు. సాల్ట్ లేక్ స్టేడియంలో మ్యాచ్ ఆడారు. మెస్సీని చూడడానికి అభిమానులు రూ.5వేల నుంచి రూ.25 వరకు వెచ్చించి టికెట్లు కొనుగోలు చేశారు. అయితే మెస్సీని సరిగా చూడలేకపోయామని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెస్సీ త్వరగా వెళ్లిపోయాడని, ఉన్న సమయంలో కూడా నాయకులు, ప్రముఖులతో సెల్ఫీలు దిగారని పేర్కొన్నారు. నిర్వాహకుల తీరుపై మండిపడుతూ.. స్టేడియంలోకి కుర్చీలు, వాటర్ బాటిళ్లు విసిరేశారు. స్టేడియంలోకి చొచ్చుకువెళ్లి ఆందోళన చేశారు. ఈ ఘటనపై సీఎం మమతా బెనర్జీ విచారం వ్యక్తం చేశారు. మెస్సీకి, క్రీడాభిమానులకు క్షమాపణలు చెప్పారు. ఈ వ్యవహారంపై విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మెస్సీ పర్యటన ఏర్పాట్లపై గవర్నర్ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని నివేదిక కోరారు. కాగా.. కోల్‌కతా ఘటన నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు అప్రమత్తం అయ్యారు.

## నటి రిచా చద్దా కీలక వ్యాఖ్యలు



బాలీవుడ్ నటి రిచా చద్దా తల్లి అయిన తర్వాత తొలిసారిగా సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. రెండేళ్ల విరామం అనంతరం మళ్లీ షూటింగ్‌కు వెళ్లిన సందర్భంగా ఆమె తన కూతురి తొలి ఫొటోను షేర్ చేస్తూ.. గర్భధారణ సమయంలో ఎదుర్కొన్న శారీరక–మానసిక వేదనతో పాటు సినీ పరిశ్రమలో తాను అనుభవించిన నమ్మక ద్రోహాలను వివరించింది. ఇండస్ట్రీలోని చీకటి కోణాన్ని ప్రస్తావిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.


- అక్షరటుడే, సినిమాడెస్క్

## మెస్సీతో మేస్త్రీ ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం రూ.100 కోట్లు: హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్ :** ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీతో సీఎం రేవంత్‌రెడ్డి మ్యాచ్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేశారు. మెస్సీతో మేస్త్రీ మ్యాచ్ కోసం రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నగరంలోని కింగ్ కోఠి ఆస్పత్రిని శనివారం ఉదయం హరీశ్‌రావు సందర్శించారు. బాగ్‌లింగంపల్లి మైనార్టీ గురుకులంలో పులువురు విద్యార్థులు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. వారు కింగ్ కోఠిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. హరీశ్‌రావు వారిని పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైనా ముఖ్యమంత్రికి, మంత్రులు పరామర్శించలేదన్నారు. అందరూ ఫుట్ బాల్ ఆడడంలో బిజీగా ఉన్నారని విమర్శలు చేశారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా అరెస్ట్



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్, లంగర్‌హౌస్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేపట్టి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన వైకుంఠరావు సహా ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ వెల్లడించారు. వారి నుంచి 5 కిలోల హాష్ ఆయిల్, 5 కిలోల గంజాయి, డ్రగ్స్ తరలించేందుకు ఉపయోగించిన బైక్ స్వాధీనం చేసుకున్నారు. వైకుంఠరావు ఒడిశాలో డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణలో వణికిస్తున్న చలిఉష్ణోగ్రతలు

**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో చలి పంజా విసురుతోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఎన్నాడు లేనంత పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. మధ్యాహ్నం సైతం చలి పెడుతుండడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌కు సంబంధించిన సాగు పనులు ప్రారంభం అయ్యాయి. ఈ క్రమంలో చలి పెడుతుండడంతో రైతులు, వ్యవసాయ కూలీలు అనారోగ్యం బారిన పడుతున్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామాలు చలితో వణికిపోతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో చలితీవ్రత అధికంగా ఉంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పలు జిల్లాల్లో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు.. సంగారెడ్డి 6.1, రంగారెడ్డి 6.3, వికారాబాద్ 6.6, ఆసిఫాబాద్ 6.8, మెదక్ 8.2, సిద్దిపేట 8.3, ఆదిలాబాద్ 8.5, కామారెడ్డి 8.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

